నమస్తే తెలంగాణ
సూర్యాపేట
5 | నల్లగొండ, ఆదివారం 23 జూన్ 2024 | SURYAPET

సిమ్ రెన్యువల్ పేరుతో సైబర్ మోసం

● రూ.1.70 లక్షలు కాజేసిన మోసగాళ్లు

నేరేడుచర్ల, జూన్ 22 : కొత్త కొత్త పంథాలతో సైబర్ నేరగాళ్లు జనాలను మోసం చేస్తున్నారు. బ్యాంకు ఖాతాల నుంచి లక్షలాది రూపాయలు కాజేస్తున్నారు. నేరేడుచర్ల పట్టణానికి చెందిన ఓ వ్యాపారికి అపరిచిత వ్యక్తి నుంచి ఫోన్ కాల్ వచ్చింది. 'మీ సిమ్ కార్డు కాల పరిమితి ముగిసింది. మీ ఫోన్ పే ద్వారా లేదా యోనో యాప్ ద్వారా డబ్బులు చెల్లించి రెన్యూవల్ చేసుకోవాలి' అని వీడియో కాల్ వచ్చింది. దానిని నమ్మిన అతను వారు చెప్పిన విధంగా ఫోన్ లైన్‌లో ఉండి యోనో యాప్ ద్వారా సెల్‌ఫోన్ రీచార్జి చేసుకున్నాడు. ఆ సమయంలో ఆ ఫోన్‌ను హాక్ చేసిన సైబర్ నేరగాళ్లు దానిలో వచ్చిన ఓటీపీని చూసి వెంటనే అతని అకౌంట్లో నుంచి రూ.1.70 లక్షలు డ్రా చేసినట్లు మేస్సేజ్ వచ్చింది. అప్పుడు అతను సైబర్ నేరానికి గురైనట్లు తెలిసి వెంటనే పోలీసులను ఆశ్రయించాడు. ఇటీవల ఏఎస్ఐ పేరు చెప్పి పలువురిని మోసం వారి అకౌంట్లలోని డబ్బులను మాయం చేసిన సంఘటన మరువక ముందే మరో ఘటన నేరేడుచర్లలో శనివారం ఇది వెలుగు చూసింది. దాంతో ప్రజలు ఆందోళనకు గురవుతున్నారు.

మూడేండ్లలో ప్రాజెక్టులన్నీ పూర్తి

త్వరలో ప్రాజెక్టుల పరిశీలనకు జిల్లాకు రానున్న సీఎం రేవంత్‌రెడ్డి

లోఓల్టేజీ సమస్య రాకుండా అవసరమైన ట్రాన్స్‌ఫార్మర్లు, సబ్ స్టేషన్ల ఏర్పాటు

జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశంలో మంత్రి కోమటిరెడ్డి

నల్లగొండ జడ్పీ చివరి జనరల్ బాడీ సమావేశంలో అనేక అంశాలపై చర్చ

ఐదేండ్లలో ఒడిదుడుకులు లేకుండా సమావేశాలు : జడ్పీ చైర్మన్ బండ

రైతు భరోసాపై స్పష్టత ఇవ్వాలి : మాజీ ఎమ్మెల్యే, జడ్పీటీసీ తిప్పన

నీలగిరి, జూన్ 22 : జిల్లాలో ఉన్న సాగునీటి ప్రాజెక్టులన్నింటినీ పూర్తి చేయడమే తమ ధ్యేయమని, రానున్న మూడేండ్లలో శ్రీశైలం సొరంగంతో పాటు బ్రాహ్మణవెల్లంల ఎత్తిపోతల పథకం, ఇతర అన్ని ప్రాజెక్టులను పూర్తి చేస్తామని రాష్ట్ర రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి అన్నారు. జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశం శనివారం చైర్మన్ బండ నరేందర్‌రెడ్డి అధ్యక్షతన జరిగింది. జూలై 4వ తేదీతో పాలకవర్గం గడువు ముగుస్తుండటంతో చివరి సమావేశంలో ఎంపీపీలు, జడ్పీటీసీలు తమ మండలాల సమస్యలను సమావేశం దృష్టికి తీసుకెళ్లారు. మిషన్ భగీరథ, వ్యవసాయం, విద్యుత్, విద్య తదితర అంశాలపై జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశం చర్చించింది. జిల్లా పరిషత్ చివరి సర్వసభ్య సమావేశంలో అనేక అంశాలు చర్చకు వచ్చాయి. ఈ సందర్భంగా మంత్రి కోమటిరెడ్డి మాట్లాడుతూ రాజకీయాలకతీతంగా నల్లగొండ జిల్లా అభివృద్ధే ధ్యేయంగా అందరూ కలిసి పనిచేయాలన్నారు. ప్రతి ఇంటికీ మిషన్ భగీరథ తాగు నీరు వచ్చేలా చూడాలని, అధికారులు గ్రామాల్లో తిరిగి సమస్యలను గుర్తించి పరిష్కరించాలని, అవసరమైతే శాసనసభ్యుల నిధుల ద్వారా చిన్న చిన్న సమస్యలను అధిగమించాలని సూచించారు. ఆగస్టు 15లోగా రాష్ట్రంలో సుమారు 31 వేల కోట్ల రూపాయలను రైతుల రుణమాఫీ చేసేందుకు రాష్ట్ర మంత్రివర్గం ఆమోదించినట్లు వెల్లడించారు. రైతు భరోసాపై సైతం త్వరలోనే నిర్ణయం తీసుకుంటామని, రూ.2 లక్షల రుణమాఫీ చేసింది గతంలో ఏ ప్రభుత్వం లేదని తెలిపారు. జిల్లాలో లోఓల్టేజీ, ఇతర లూజ్ వైర్ల మరమ్మతులు, సబ్ స్టేషన్లు, ట్రాన్స్‌ఫార్మర్లు తదితర వాటి కోసం ఇదివరకే జిల్లాకు రూ.11 కోట్లు మంజూరు చేశామని, మరో రూ.7 కోట్లు విడుదల కానున్నాయని చెప్పారు. జిల్లాలో ఎక్కడైనా ట్రాన్స్‌ఫార్మర్లు, ఓవర్ లోడ్ సమస్యలను తమ దృష్టికి తీసుకువస్తే వెంటనే వాటిని పరిష్కరిస్తామని తెలిపారు. అడిషనల్ బడ్జెట్‌ను ప్రతిపాదించాలని విద్యుత్ ఎస్ఈని ఆదేశించగా, విద్యుత్ సమస్యలను తన దృష్టికి తీసుకురావాలని సభ్యులతో కోరారు.

జడ్పీ చివరి జనరల్ బాడీ సమావేశం సందర్భంగా అందరి సభ్యులతో కలిసి ఫొటో దిగిన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, జడ్పీ చైర్మన్ బండ నరేందర్‌రెడ్డి, కలెక్టర్ నారాయణరెడ్డి, ఎస్పీ శరత్ చంద్రపవార్ తదితరులు

ఇదిలా ఉంటే విద్యుత్ శాఖ అధికారుల తీరుపై వాడివేడిగా చర్చ సాగింది. జడ్పీటీసీ తిప్పన విజయసింహారెడ్డి మాట్లాడుతూ మిర్యాలగూడలో ప్రతి రోజూ విద్యుత్‌కు అంతరాయం కలుగుతుందని అధికారులు పట్టించుకోవడం లేదని అన్నారు. మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి స్పందించి చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సందర్భంగా పలువురు జడ్పీటీసీలు, ఎంపీపీలు మాట్లాడుతూ గ్రామాల్లో చిన్న చిన్న సమస్యలను పరిష్కరించాలని సమావేశం దృష్టికి తీసుకువచ్చారు. ఈ సమావేశానికి హాజరైన జడ్పీటీసీలు, ఎంపీపీలను శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి, మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి శాలువా, మెమెంటోలతో సన్మానించారు. అనంతరం మంత్రులు, ఎమ్మెల్యేలతో పాలకమండలి సభ్యులు ఫొటోలు దిగి ప్రతి సభ్యుడిని సన్మానించారు. చివరి సమావేశం కావడంతో సభ్యులంతా గ్రూపు ఫొటో దిగారు. ఈ సమావేశంలో భువనగిరి పార్లమెంట్ సభ్యుడు చామల కిరణ్‌కుమార్‌రెడ్డి, కలెక్టర్ సి.నారాయణరెడ్డి, అదనపు కలెక్టర్ జె. శ్రీనివాస్, జడ్పీ సీఈఓ ప్రేమ్‌కరణ్‌రెడ్డి, డిప్యూటీ సీఈఓ శ్రీనివాసరావు, జడ్పీటీసీలు, ఎంపీపీలు, జిల్లా స్థాయి అధికారులు పాల్గొన్నారు.

పెండింగ్ ప్రాజెక్టులపై చొరవ చూపాలి : మండలి చైర్మన్ గుత్తా

సాగునీటి ప్రాజెక్టుల మంత్రిగా ఉమ్మడి జిల్లాకు చెందిన ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, జిల్లాలో రోడ్లు, భవనాల శాఖ మంత్రిగా కోమటిరెడ్డి వెంకటరెడ్డి ఉన్నందున జిల్లాలో పెండింగ్‌లో ఉన్న గొట్టిముక్కల, సింగరాజుపాలెం, పెండ్లిపాకుల రిజర్వాయర్లు, పిల్లాయిపల్లి, ధర్మారెడ్డి రిజర్వాయర్లు, కాల్వలను పూర్తిచేయడానికి చొరవ చూపాలి. ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా సమష్టిగా జిల్లా అభివృద్ధికి కృషి చేద్దాం. వరద నీటితో నిండే ప్రాజెక్టులు ప్రస్తుతం దాదాపు 98శాతం పూర్తయ్యాయని, వాటికి మరో రూ.40 కోట్లు కేటాయిస్తే ప్రజలకు అందుబాటులోకి వస్తాయి. మిషన్ భగీరథకు సంబంధించిన బిల్లుల చెల్లింపులపై అధికారులు స్పష్టత నివ్వాలి. ఎస్‌డీసీ నిధులకు సంబంధించి కలెక్టర్ లాగిన్‌లో పెండింగ్‌లో ఉన్నాయి, వాటిని అప్రూవల్ చేయాలి.

జడ్పీ సమావేశంలో పాల్గొన్న ఎమ్మెల్యేలు వేముల వీరేశం, నేనావత్ బాలూనాయక్, మందుల సామేల్, బత్తుల లక్ష్మారెడ్డి, ఎమ్మెల్సీ అల్గుబెల్లి నర్సిరెడ్డి, జడ్పీటీసీలు, ఎంపీపీలు, అధికారులు

అధికారుల వైఫల్యంతోనే ఎరువుల, విత్తనాల సమస్యలు : వేముల వీరేశం, నకిరేకల్ ఎమ్మెల్యే

'జిల్లాలోని రైతాంగానికి సరిపడా ఎరువులు, విత్తనాలను ప్రభుత్వం అందించేందుకు సిద్ధంగా ఉన్నా, అధికారుల వైఫల్యం కారణంగా అక్కడక్కడ ఎరువులు, విత్తనాల సమస్యలు వస్తున్నాయి. వారు ముందుగా సరైన ప్రతిపాదనలు చేసుకుంటే సమస్యలు రావు. ధర్మారెడ్డి కాల్వ, పిల్లాయిపల్లి కాల్వలపై ఉన్న అక్రమ మోటర్లను తొలగిస్తే పూర్తిస్థాయిలో నీరు వచ్చే వీలుంటుంది'.

మన ఊరు- మనబడి పనులను పూర్తిచేయాలి : అల్గుబెల్లి నర్సిరెడ్డి, ఎమ్మెల్సీ

'అప్పటి కేసీఆర్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన మన ఊరు-మన బడి కార్యక్రమంలో చాలా పాఠశాలల్లో అభివృద్ధి పనులు మధ్యలోనే ఆగిపోయాయి. వాటిని పూర్తి చేయాలి. పాఠశాలలకు ఇచ్చే స్టేషనరీ, కరెంట్ బిల్లులు చాలా వరకు రావడం లేదు. ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి కృషి చేయాలి. ప్రతి పాఠశాలను శుభ్రపరిచేందుకు సిబ్బందిని నియమించాలి. విద్యుత్ బిల్లులు, శానిటేషన్‌కు స్కూల్ గ్రాంట్ మంజూరు చేయాలి. కేజీబీవీ సమర్థవంతంగా పనిచేసేందుకు చర్యలు చేపట్టాలి'.

ఐదేండ్లు సజావుగా సమావేశాల నిర్వహణ : జడ్పీ చైర్మన్ బండ

'గడిచిన 5 సంవత్సరాలు ఒడిదుడుకులు లేకుండా జిల్లా పరిషత్ కార్యక్రమాలను, సమావేశాలను సజావుగా నిర్వహించాం. ఎన్నో రకాల ప్రజాసమస్యలను జిల్లా పరిషత్ స మావేశంలో చర్చించి పరిష్కరించగలిగాం. అన్ని సమావేశా లు ఇబ్బందులు కలుగకుండా సహకరించిన అందరికీ కృతజ్ఞతలు'.

వాతావరణ మార్పులతోనే కరెంట్ సమస్యలు : బత్తుల లక్ష్మారెడ్డి, మిర్యాలగూడ ఎమ్మెల్యే

'కాంగ్రెస్ ప్రభుత్వం 24 గంటలు ఉచిత విద్యుత్‌ను అందిస్తున్నది. వాతావరణంలో మార్పుల కారణంగా అక్కడక్కడ వైర్లు, ఇతర సమస్యల కారణంగా అధికారులే కరెంటును తొలగిస్తున్నారు. ప్రమాదాలు జరుగకుండా ముందస్తు జాగ్రత్తలో భాగంగా గాలి దుమారం, ఇతర సమస్యలు వచ్చినప్పుడు, చెట్లు తొలగించే సమయంలో కరెంటును నిలిపివేస్తున్నారు'.

పంచాయతీరాజ్ రోడ్లు కంకర తేలి ఉన్నాయి : మందుల సామేలు, తుంగతుర్తి ఎమ్మెల్యే

'శాలిగౌరారం మండలంలో పంచాయతీరాజ్ రోడ్లు కొన్నిచోట్ల కంకర తేలి ఉన్నాయి, వాటిని బాగు చేయాలి. జాతీయ రహదారి నుంచి ఇరుకులపాడు రోడ్డు పనులను వెంటనే ప్రారంభించాలి. శాలిగౌరారం చెరువు కట్టను పటిష్టం చేసే పనులు చేపట్టాలి. ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిబ్బంది పనితీరును మెరుగుపరుచుకోవాలి'.

నియోజకవర్గానికి రెండు కోట్లు ఇవ్వాలి : నేనావత్ బాలూనాయక్, దేవరకొండ ఎమ్మెల్యే

'వర్షాలకు విద్యుత్ స్తంభాలు చాలా ప్రాంతాల్లో కూలిపోయాయి. లూజ్ వైర్లు తెగిపడి ప్రమాదాలు జరిగే అవకాశం ఉంది. చాలా తండాల్లో కరెంటు తీగలు ఇండ్లపై నుంచి ఉన్నాయి, వాటిని తొలగించాలి. విద్యుత్ సమస్యలను అధిగమించేందుకు ప్రతి నియోజకవర్గానికి రెండు కోట్ల రూపాయలు ఇప్పించే విధంగా మంత్రి చొరవ చూపాలి'.

ఐదారు గంటలు కరెంట్ పోతున్నది : తిప్పన విజయసంహారెడ్డి, జడ్పీటీసీ

'వానకాలం పంటలకు సంబంధించి రైతులు ఇప్పటికే చాలా వరకు పంటలు వేసుకున్నారు. పెట్టుబడులకు వడ్డీ వ్యాపారస్తులను అశ్రయిస్తున్నారు. ప్రభుత్వం ప్రకటించిన విధంగా రైతు భరోసా ద్వారా ఎకరాకు 15వేల రుపాయలు ఇస్తామని చెప్పారు. దాని ప్రకారం వెంటనే వారి ఖాతాలో జమ చేయాలి. చాలా గ్రామాల్లో కరెంట్ సమస్య ఉత్పన్నమవుతున్నది. ప్రతి రోజూ ఐదారు గంటల కరెంటు పోతున్నది. ఫలితంగా ఆయకట్టు ప్రాంతంలో అక్కడక్కడ బోర్ల కింద సాగు చేసిన పొలాలు ఎండిపోతున్నాయి'.



డీసీఎంఎస్ చైర్మన్‌గా ఎన్నికైన బోళ్ల వెంకట్‌రెడ్డిని సన్మానిస్తున్న మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి

డీసీఎంఎస్ చైర్మన్‌గా బోళ్ల వెంకట్‌రెడ్డి

నల్లగొండ సిటీ, జూన్ 22 : ఉమ్మడి నల్లగొండ జిల్లా డీసీఎంఎస్ చైర్మన్‌గా బోళ్ల వెంకట్‌రెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. డీసీఎంఎస్‌లో కొంత కాలంగా చైర్మన్ లేకపోవడంతో వైస్ చైర్మన్‌గా ఉన్న దుర్గంపూడి నారాయణరెడ్డి ఇన్‌చార్జి చైర్మన్‌గా బాధ్యతలు నిర్వర్తించారు. డీసీఎంఎస్ డైరెక్టలందరూ ప్రస్తుతం కేతేపల్లి పీఏసీఎస్ చైర్మన్‌గా వ్యవహరిస్తున్న బోళ్ల వెంకట్‌రెడ్డిని చైర్మన్‌గా ఎన్నుకున్నారు. డీసీఎంఎస్ కార్యాలయంలో శనివారం ఆయన ప్రమాణ స్వీకారం చేసి బాధ్యతలు స్వీకరించారు. ఈ కార్యక్రమానికి మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి హాజరయ్యారు. బోళ్ల వెంకట్‌రెడ్డిని శాలువాతో సత్కరించి ఎన్నిక పత్రం అందజేశారు. ఈ సందర్భంగా పలువురు డైరెక్టర్లు నూతన చైర్మన్‌కు పుష్ప గుచ్చాలు అందించి శుభాకాంక్షలు తెలిపారు. ప్రస్తుతం నల్లగొండ డీసీఎంఎస్ పాలకవర్గంలో చైర్మన్‌గా బోళ్ల వెంకట్‌రెడ్డి, వైస్ చైర్మన్‌గా దుర్గంపూడి నారాయణరెడ్డి, డైరెక్టర్లుగా గుడిపాటి సైదులు, ధనావత్ జయరాం, దొంగర వెంకటేశ్వర్లు, నెల్లూరు ఉషారాణి, ఎస్.అనూరాధ, కొండ సరిత, కర్నాటి లింగయ్య ఉన్నారు. ఈ కార్యక్రమంలో నల్లగొండ మున్సిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాసరెడ్డి, డీసీఓ కిరణ్‌కుమార్, ఎన్‌డీసీఎంఎస్ జిల్లా బిజినెస్ మేనేజర్ నాగిళ్ల మురళి పాల్గొన్నారు.

రోగులకు మెరుగైన సేవలందించాలి

● జనరల్ ఆస్పత్రిని తనిఖీ చేసిన కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్

సూర్యాపేట జనరల్ ఆస్పత్రిలో రోగులతో మాట్లాడుతున్న కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్

సూర్యాపేట, జూన్ 22 : ఆరోగ్య సమస్యలతో వచ్చే రోగులకు మెరుగైన వైద్యం అందించాలని సూర్యాపేట కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ వైద్యాధికారులను ఆదేశించారు. శనివారం జిల్లా కేంద్రంలోని జనరల్ ఆస్పత్రిని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం వైద్య రంగానికి అధిక ప్రాధాన్యం ఇస్తున్నదని, వైద్యం కోసం వచ్చే రోగులకు మెరుగైన సేవలు అందించాలని అన్నారు. రోగులు ఎక్కడా ఇబ్బంది పడకుండా వారికి నాణ్యమైన వైద్యం అందినప్పుడే ప్రభుత్వ వైద్యంపై ప్రజలకు నమ్మకం పెరుగుతుందని తెలిపారు. దవాఖానలో శానిటేషన్ నిరంతరం చేపట్టాలని, ఐసీయూలో శానిటేషన్‌తోపాటు బెడ్లు మారుస్తూండాలని సూచించారు. ప్రసూతి కోసం వచ్చే గర్భిణులకు సాధారణ కాన్పులకు ఎక్కువ ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. దవాఖానలో మందుల కొరత లేకుండా చూడాలని చెప్పారు.

వైద్యులు, సిబ్బంది హాజరు శాతం పరిశీలించిన కలెక్టర్ జనరల్ క్యాజువాలిటీ, ఆర్థో వార్డులను తనిఖీ చేశారు. అక్కడ రోగులతో మాట్లాడి అందుతున్న సేవలను అడిగి తెలుసుకున్నారు. ఆస్పత్రిలో అత్యవసరంగా కావాల్సిన సౌకార్యాల కోసం వెంటనే ఒక నివేదిక తయారు చేసి అందించాలని ఆదేశించారు. ఆయన వెంట డాక్టర్లు సర్వోత్తం, నర్సంహ, సిబ్బంది ఉన్నారు.

రుణమాఫీపై స్పష్టత ఇవ్వాలి

● విధివిధానాలు ఏమిటో చెప్పాలి

● ఏడు నెలలైనా రైతుబంధు రూ.15 వేలు ఏది?

● విలేకరుల సమావేశంలో మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి

సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య

నార్కట్‌పల్లి, జూన్ 22 : ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రైతులను విస్మరిస్తున్నారని, రూ. రెండు లక్షల రుణ మాఫీపై స్పష్టత ఇవ్వాలని నకిరేకల్ మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య అన్నారు. నార్కట్‌పల్లిలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నోరు తెరిస్తే రూ. 2లక్షల రుణ మాఫీ అంటున్నాడని, రాష్ట్రంలో ఏ బ్యాంకులోనైనా ఏ ఒక్క రైతుకైనా రూ. 2లక్షల రుణం ఇచ్చిన దాఖలాలు ఉన్నాయా ప్రశ్నించారు. డిసెంబర్ 9, 2023 నుంచి ఆగస్టు 15 మళ్లీ తిరిగి డిసెంబర్ 15 ఇలా తేదీలు మార్చడమే తప్ప రుణమాఫీ జరిగేటట్లు లేదని, ముందు దానిపై శ్రద్ధ పెట్టాలని అన్నారు. రైతు రుణ మాఫీ ఏ ప్రాతిపాదికన చేస్తున్నారని, దానికి అర్హులు ఎవరు, ఎలా గుర్తిస్తారు, విధివిధానాలు ఏమిటో చెప్పాలన్నారు. ఏడు నెలలు గడిచినా రైతు బంధు ఎకరానికి రూ.15 వేలు ఏమయ్యాయని, సబ్ కమిటీలు వేస్తున్నామని చెప్తూ కాలయాపన చేస్తున్నారని విమర్శించారు. కేసీఆర్ హయాంలో 9 సంవత్సరాలు సమయానికి రైతు బంధు, విత్తనాలు, ఎరువుల పంపిణీ చేయగా, కాంగ్రెస్ సర్కారులో ఎందుకు నిర్లక్ష్యం జరుగుతున్నదని తెలిపారు.

ఇప్పుడు 24 గంటల కరెంట్ ఇవ్వడం లేదని, రైతు బీమా ఊసేలేదని మండిపడ్డారు. ప్రజలు నమ్మి గెలిపిస్తే కాంగ్రెస్ చేసేది ఇదేనా? ఇకకైనా ప్రజలు, రైతుల శ్రేయస్సు కోసం పాలనపై దృష్టి పెట్టాలని చెప్పారు. కక్ష్య సాధింపు చర్యలు, బెదిరింపులకు పాల్పడితే ఊరుకునేది లేదని హెచ్చరించారు. ఆయన వెంట బీఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు, ఎంపీటీసీ చిరుమర్తి యాదయ్య ఉన్నారు.

ఎంకేఆర్ మిల్లుపై కేసు నమోదు

● 14,524 మెట్రిక్ టన్నుల సీఎంఆర్ ధాన్యం నిల్వలు మాయం

గరిడేపల్లి, జూన్ 22 : గరిడేపల్లి మండలంలోని ఎంకేఆర్ మిల్లుపై అధికాలు కేసు నమోదు చేశారు. సీఎంఆర్‌లో అవకతవకల కారణంగా తనిఖీలు చేశారు. వివరాలు.. 2022-23 యాసంగి, 2023- 24 వానకాలానికి సంబంధించి 15,794 టన్నుల సీఎంఆర్ ప్రభుత్వానికి అందించాల్సి ఉండగా కేవలం 1,270 టన్నులు మాత్రమే అందించారు. మిగిలిన 14,524 టన్నుల ధాన్యానికి సంబంధించిన బియ్యం నిల్వలు మిల్లులో ఉండాల్సి ఉంది. అవి లేకపోగా రికార్డుల్లో సైతం ఆధారాలు దొరకలేదని అధికారులు తెలిపారు. కేసు నమోదు చేసి పూర్తి స్థాయి విచారణ జరిపిన అనంతరం చర్యలు తీసుకోనున్నట్లు పేర్కొన్నారు. తనిఖీల్లో జిల్లా సివిల్ సప్లయ్ అధికారి మోహన్‌బాబు, డీఎం రాములు, హుజూర్‌నగర్, కోదాడ డీటీసీఎస్‌లు రాజశేఖర్, రాంరెడ్డి, తాసీల్దార్ బండ కవిత, ఆర్ఐ రాంబాబు పాల్గొన్నారు.

ఫణిగిరి మ్యూజియానికి తిరిగి చేరిన బౌద్ధ శిల్పాలు

ఫణిగిరికి తిరిగివచ్చిన బౌద్ధ జాతక శిల్పాలు, తోరణాలు

నాగారం, జూన్ 22 : నాగారం మండలం ఫణిగిరిలోని ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన బౌద్ధ క్షేత్రంలో అప్పట్లో బయటపడిన విగ్రహాలలో బౌద్ధ జాతక కథలను తెలిపే తోరణాలు, శిల్పాలు గత సంవత్సరం జూలై, 2023న అంతర్జాతీయ ప్రదర్శన నిమిత్తం అమెరికాలోని న్యూయార్క్, మెట్రోపాలిటన్ మ్యూజియం, దక్షిణ కొరియా సియోల్‌కు తీసుకెళ్లారు. న్యూయార్క్ మ్యూజియంలో ప్రపంచంలోని పురావస్తు శాఖ శాస్త్రవేత్తలు, పరిశోధకులు విగ్రహాలను సందర్శించి, భారతదేశంలోని గౌతమ బుద్ధుడి కాలంలోని ప్రజలు వారి కళా నైపుణ్యాన్ని చూసి ప్రపంచానికి భారతీయ నాగరికతను తెలియజేయి. ప్రదర్శన అనంతరం తిరిగి ఫణిగిరిలోని బుద్ధిస్ట్ ఆర్కియాలజీ మ్యూజియానికి వాటిని చేర్చినట్లు పురావస్తు శాఖ ఏడీఏ మల్లు నాయక్ తెలిపారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఫణిగిరిలో లభించిన బౌద్ధ సంపదకు ప్రపంచ గుర్తింపు లభించిందన్నారు. ఆయన వెంట పురావస్తు శాఖ ఏడీ బుజ్జి, సిబ్బంది గట్టు వీరన్న, చిలుకూరి కార్తిక్, సోమారపు యాకయ్య ఉన్నారు.

1,268 ఖాళీలు.. 31,915 దరఖాస్తులు

● టీఆర్‌టీకి ముగిసిన దరఖాస్తుల గడువు

● బయాలజీ, సోషల్, ఎస్‌జీటీకి అత్యధిక అప్లికేషన్స్

రామగిరి, జూన్ 22 : టీచర్ రిక్రూట్‌మెంట్ టెస్ట్ (టీఆర్‌టీ) ఆన్‌లైన్ దరఖాస్తుల గడువు ఈ నెల 21తో ముగిసింది. ఉమ్మడి నల్లగొండ జిల్లా వ్యాప్తంగా వివిధ విభాగాల్లో 1,268 టీచర్ పోస్టుల భర్తీ చేయనుండగా వీటికి 31,915 మంది అభ్యర్థులు దరఖాస్తులు సమర్పించారు. అత్యధిక దరఖాస్తులు స్కూల్ అసిస్టెంట్ బయాలజీ, సోషల్ స్టడీస్‌తోపాటు ఎస్‌జీటీకి వచ్చినట్లు అధికారులు వెల్లడించారు.

జిల్లా వారీగా ఖాళీలు..దరఖాస్తులు

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 1,268 పోస్టులు ఖాళీలుండగా వీటిలో నల్లగొండ జిల్లాలో 605, సూర్యాపేటలో 386, యాదాద్రిభువనగిరిలో 277 పోస్టులు ఉన్నాయి. సూర్యాపేట జిల్లాలో మొత్తం 11,907, యాదాద్రి భువనగిరి జిల్లాలో 4,398 దరఖాస్తులు వచ్చాయి.
నల్లగొండ జిల్లాలో సోషల్ స్టడీస్‌లో 38 పోస్టులు ఖాళీగా ఉండగా 2,967, బయాలజీలో 23 పోస్టులకు 2,579, ఎస్‌జీటీలో 430 పోస్టులకు 3,379 మొత్తం 15,610 దరఖాస్తులు వచ్చాయి.

కేటగిరీల వారీగా ఖాళీలు.. దరఖాస్తులు

జిల్లా	ఎస్‌ఏ పోస్టులు -దరఖాస్తులు	ఎస్‌జీటీ పోస్టులు -దరఖాస్తులు	ఎల్‌పీ పోస్టులు - దరఖాస్తులు	పీఈటీ పోస్టులు - దరఖాస్తులు
నల్లగొండ	136-10,486	430-3,379	28-1,130	11-615
యాదాద్రి	094-3,035	160- 774	21-438	02-151
సూర్యాపేట	97-7,695	261-2,996	23-736	5-480

ఇన్‌స్పైర్-మనక్‌కు మూడు ప్రాజెక్టుల ఎంపిక

రామగిరి, జూన్ 22 : 2022-23 విద్యా సంవత్సరానికి ఈ నెల 14, 15న ఆన్‌లైన్‌లో రాష్ట్ర స్థాయిలో నిర్వహించిన ఇన్‌స్పైర్-మనక్ అవార్డు-2023 ప్రదర్శనలో నల్లగొండ జిల్లా నుంచి మూడు ప్రాజెక్టులు జాతీయ స్థాయికి ఎంపికైనట్లు డీఈఓ బి.భిక్షపతి తెలిపారు. విద్యార్థులు, ఉపాధ్యాయులను ప్రోత్సహించి జిల్లా ఖ్యాతి చాటిన జిల్లా సైన్స్ అధికారి వనం లక్ష్మీపతితోపాటు ఎంపికైన పాఠశాలల విద్యార్థులు, గైడ్ టీచర్స్, ఆయాపాఠశాలల యాజమాన్యాలకు డీఈఓ అభినందనలు తెలిపారు.

ఎంపికైన పాఠశాలలు ఇవే..

- ఫ్రెండ్లీ డ్రమ్ సీడర్ ఫర్ ఫార్మర్ - సిగపట్ల ఈశ్వర్‌సాయి - జడ్పీహెచ్ఎస్, కొండ్రపోల్, దామరచర్ల మండలం
- స్పెషల్ బెడ్ ఫర్ నాన్‌మువబుల్ పర్సన్స్ ఫర్ వాష్ రూమ్ - బొల్లం సందీప్ - జడ్పీహెచ్ఎస్, దోరెపల్లి కనగల్ మండలం
- వైఫర్ ఫర్ బైక్ హెల్మెంట్ వాటర్ క్లీనింగ్ - సంక్రాంతి సోనియా - జడ్పీహెచ్ఎస్, దుగ్గపల్లి త్రిపురారం మండలం